aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity - the voice of the people.
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
శుక్రవారం 14-08-2026 సంపుటి : 01 సంచిక : 143 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక
- చక్కెర, ఉప్పు, కొవ్వు వివరాలు స్పష్టంగా చూపించాలి
- ప్రజల ఆరోగ్యం కంటే కార్పొరేట్ ప్రయోజనాలా?
- రెండు వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వినియోగదారులకు తెలుసుకునే హక్కు ఉందన్న ధర్మాసనం
- లేబుళ్ల అమలులో జాప్యంపై అసంతృప్తి
- 'మీరు చేయకపోతే మేమే చేస్తాం'
- పిల్లల ఆరోగ్య పరిరక్షణే ప్రధానమన్న కోర్టు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై ప్రశ్నల వర్షం

03

### ఆహార ప్యాకెట్లపై హెచ్చరికలు తప్పనిసరి!

ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్స్ ద్వారా అందించే సమాచారం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్యాకెట్లపై అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు వంటి అంశాలను స్పష్టంగా తెలియజేసే విధానాన్ని అమలు చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, వినియోగదారులకు ముఖ్యంగా పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలపై అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.



## నాపైనే కుల వివక్ష

- హల్ద్వానీ ఘటనతో అవమానానికి గురయ్యానన్న ఖర్గే
- ప్రసంగించిన ప్రదేశంలో శుద్ధీకరణపై తీవ్ర అభ్యంతరం
- 'ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి' అంటూ రాజ్యసభలో ఆవేదన
- అంటరానితనం చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్
- ఘటనపై విచారణ జరిపిస్తామని కేంద్రం హామీ

న్యూఢిల్లీ ఆగస్టు 13( మహాప్రభ )
బీజేపీ పాలనలో దళితులకు సరైన గౌరవం దక్కదని మరోసారి రుజువైంది. ఈ అనుభవం సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఎదురైంది. రాజ్యసభ ప్రతిపక్ష నేత కూడా అయిన ఖర్గేకు ఉత్తరా ఖండ్‌లో తీవ్ర అవమానం జరిగింది. ఈనెల 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ లో ఖర్గే ఒక బహిరంగసభలో ప్రసంగించిన

-మిగతా 3 లో



## భూములు కనిపిస్తే అమ్మేయడమేనా?

- రాయదుర్గంలో హెరిటేజ్ భూముల విక్రయాన్ని ఉపసంహరించాలి
- వేలంపాటలో కొనుగోలు చేస్తే న్యాయపరమైన సమస్యలు తప్పవు
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్ఆగస్టు 13( మహాప్రభ )
ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? అని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు ప్రశ్నించారు. నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు ఇచ్చి ఇప్పుడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన బహిరంగలేఖ రాశారు. గతంలో కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఇప్పుడు రాయదుర్గం ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు. రాయదుర్గం పన్మక్త గ్రామంలోని సర్వే నెంబర్ 83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఈనెల 17, 21 తేదీల్లో టీజీఐఐసీ వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని

-మిగతా 3 లో

## 'ఇందిరమ్మ ఇండ్లు' టవర్స్‌కు శ్రీకారం

**కూకట్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని శ్రీధర్‌బాబుకు సీఎం ఆదేశం**

### మొదటి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం


- పదేళ్ల వారి పాలన.. రెండేళ్ల మా పాలనను బేరీజు వేయాలని పిలుపు
- గల్లీ నుంచి ఢిల్లీకి పంపిన కూకట్‌పల్లి ప్రజలకు సీఎం కృతజ్ఞతలు
- సంక్షేమ పథకాల అమలుతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని వ్యాఖ్య
- 22ఏ అంశంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా
- తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 13( మహాప్రభ )
కూకట్ పల్లి లో "ఇందిరమ్మ ఇండ్లు" టవర్స్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానని, కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి అని సీఎం పేర్కొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు ని ఆదేశించారు. పదేళ్ల వారి పరిపాలన

-మిగతా 3 లో







80వ స్వాతంత్ర్య వేడుకలు..

## ముస్తాబైన ఎర్రకోట

- 80వ స్వాతంత్ర్య వేడుకలకు సర్వాంగ సుందరంగా ఎర్రకోట
- ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్న ప్రధాని మోదీ
- 'వందేమాతరం-150', 'వికసిత్ భారత్@2047' ప్రధాన థీమ్‌లు
- వందేమాతరం ఆకృతిలో 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, వాలంటీర్లు
- 5 వేల మంది ప్రత్యేక ఆహ్వానితులతో ఘనంగా వేడుకలు
- భద్రత, రవాణా, పారిశుద్ధ్య ఏర్పాట్లు పూర్తి

03

## భారత్‌ను కప్పేసిన నైరుతి మేఘాలు



03

- బలం పుంజుకున్న రుతుపవనాలు
- అల్పపీడన ప్రభావంతో చురుగ్గా మారిన రుతుపవనాలు
- దేశవ్యాప్తంగా విస్తరించిన దట్టమైన మేఘావరణం
- ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టమైన వర్షపు మేఘాల కదలిక
- పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
- ఒడిశా, పశ్చిమ బెంగాల్‌పై అల్పపీడన ప్రభావం

## పార్లమెంటులో 12 బిల్లులు ఆమోదం



03

- వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు పార్లమెంట్ ఆమోదం
- 11 బిల్లులు చర్చ లేకుండానే లోక్‌సభలో ఆమోదం
- నీట్ అవకతవకల బిల్లుపైనే ఉభయ సభల్లో విస్తృత చర్చ
- మోడీ, షా వైఖరితో స్తంభించిన సభలంటూ ప్రతిపక్షాల విమర్శ
- లోక్‌సభ ఉత్పాదకత 19%, రాజ్యసభ 39%గా నమోదు

## మంత్రి తుమ్మల రికార్డు


### రాజకీయ చరిత్రలోనే అరుదైన ఘట్టం



- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు 21 సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ
- నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం
- 4 ప్రభుత్వాల సాక్షిగా ఒకే గౌరవం
- ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవల

హైదరాబాద్ ఆగస్టు 13( మహాప్రభ )
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో దేశంలో రాజకీయాల్లో పార్టీలు మారతాయి... ప్రభుత్వాలు మారతాయి... కానీ ఒక నేత పట్ల ప్రజావిశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు! తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షర సత్యం.

-మిగతా 3 లో



## చీకట్లో బంగ్లాదేశ్..

- తీవ్ర విద్యుత్ సంక్షోభంలో దేశం..
- రోజుకు 10 గంటల వరకు విద్యుత్ కోతలు
- చమురు కొరతతో తగ్గిన విద్యుత్ ఉత్పత్తి
- డీజిల్ సరఫరా కోసం భారత్‌కు ఢాకా విజ్ఞప్తి
- ప్రజల ఆగ్రహం.. పరిశ్రమలు, రైతులపై తీవ్ర ప్రభావం
- సాయం చేయాలంటూ ఇండియాకు వినతి

న్యూఢిల్లీ ఆగస్టు 13( మహాప్రభ )
కొద్ది రోజులుగా బంగ్లాదేశ్ చీకట్లో మగ్గుతోంది. దేశం ఎప్పుడూ లేని విధంగా, తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏకంగా 9-10 గంటల విద్యుత్ కోతలు నమోదవుతున్నాయి. తారిక్ రహమాన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఈ విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కోలేకపోతోంది. చివరకు భారత్ సాయం కావాలని కోరింది. గతంలో ఎప్పుడూ లేని విద్యుత్ సంక్షోభాన్ని ప్రస్తుతం బంగ్లాదేశ్ ఎదుర్కొంటోంది. తగినంత విద్యుత్ సరఫరా చేయలేకపోవడంతో దేశమంతా భారీ విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 10 గంటల వరకు కోతలు

-మిగతా 3 లో



## అంబులెన్స్ ఆలస్యమైతే 10 వేల జరిమానా!

- హైవేల్లో 10 కి.మీ పరిధిలో 10 నిమిషాల్లో చేరుకోవాలి
- ప్రమాదాల్లో జాప్యం నివారణకు ఎన్‌హెచ్ఏఐ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ :ఆగస్టు 13( మహాప్రభ )
జాతీయ రహదారులపై ప్రమాదాల సమయంలో అత్యవసర స్పందనలో జరిగే ఆలస్యాన్ని నివారించేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) 10 నిమిషాల డెడ్‌లైన్‌ను తీసుకొచ్చింది. 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రమాదస్థలికి 10 నిమిషాల్లోపు అంబులెన్స్ చేరుకోవాలని బుధవారం విడుదల చేసిన తన విధాన మార్గ దర్శకాల్లో పేర్కొంది. ఇలా చేరుకోని పక్షంలో ప్రతి ఘటనలో రూ.10 వేలు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రమాదాల్లో సహాయ టికెట్ అభ్యర్థనను ఆమోదించినప్పటి నుంచి గంట లోపు

-మిగతా 3 లో

# లడఖ్‌లో గంటల వ్యవధిలో రెండు భూప్రకంపనలు



**న్యూఢిల్లీ ఆగస్టు 13( మహాప్రభ )**
కేంద్రపాలిత ప్రాంతం లడఖ్ లోని లేహ్ లో గంటల వ్యవధిలో రెండుసార్లు భూకంపం సంభవించింది. ముందుగా గురువారం ఉదయం ఆరు గంటలకు భూప్రకంపనలు వచ్చాయి. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలు పై 5.5 గా నమోదైంది. కేవలం నాలుగు గంటల వ్యవధిలో మళ్లీ భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. లడఖ్ ఇప్పటికే తరచూ భూకంపాలు సంభవించే ప్రాంతంగా ఉన్నది. ఉదయం 9.54 గంటలకు భూ ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 4.3 గా నమోదైంది. భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ వివరించింది. ఈ భూకంపంవల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని వెల్లడించింది.

# విద్యార్థులకు గుడ్ న్యూస్..!

### - ప్రభుత్వ స్కూల్స్‌లో ఇక ఇడ్లీ- సాంబార్



**న్యూఢీల్లి ఆగస్టు 13( మహాప్రభ )**
విద్యార్థులకు ఢిల్లీ పభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పీఎం పోషణ్ మెనూలో భాగంగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇడ్లీ–సాంబార్ వడ్డించనున్నారు. ఆగస్టు 24 నాటికి ఇడ్లీ–సాంబార్‌ను తప్పనిసరిగా అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏజెన్సీలను ప్రభుత్వం ఆదేశించింది. పీఎం పోషణ్ సవరించిన మెనూ ప్రకారం రాగి హల్వా స్థానంలో గోధుమ పిండి, శనగ మసాలా, అలాగే వెజిటబుల్ దలియా (గోధుమ రవ్వ ఉప్మా) స్థానంలో జొన్నలు, సజ్జలను చేర్చారు. దీనితో పాటు రాబోయే రెండు వారాల్లో విద్యార్థులకు ఇడ్లీ–సాంబార్‌ను అందించనున్నారు.ఆగస్టు 24 నాటికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యా శాఖ పాఠశాలలను, అమలు చేసే ఏజెన్సీలను ఆదేశించింది. సవరించిన మెనూలోని చాలా అంశాలు తక్షణమే అమల్లోకి వస్తున్నప్పటికీ, ఇడ్లీ–సాంబార్ అమలును వెంటనే చేపట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది. ఇడ్లీ తయారీకి ప్రత్యేక పరికరాలు, పదార్థాలు, రవానా సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది తదితర అవసరాల రీత్యా దీని అమలుకు రెండు వారాల గడువు ఇచ్చారు. అయితే వారంలో ఆరు రోజులు మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# 3,718 మొబైల్ యాప్‌లు బ్లాక్ వెల్లడించిన కేంద్రం

**న్యూఢీల్లి ఆగస్టు 13( మహాప్రభ )**



వినియోగదారులను మోసం చేశాయన్న ఆరోపణలతో మోసపూరిత రుణ యాప్‌లతో సహా మొత్తం 3,718 మొబైల్ యాప్‌లను కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం లోక్‌సభకు తెలిపారు. ఈ ఏడాది జూన్ 30 వరకు ఐటీ చట్టం–2000లోని 69(ఏ), 79(3)(బీ) సెక్షన్ల కింద మోసపూరిత రుణ యాప్‌లతో సహా మొత్తం 3,718 మొబైల్ యాప్‌లను భారతీయ సైబర్ క్రైమ్ సమన్వయ సెంటర్ నిలిపివేసింది(బ్లాక్ చేసింది) అని ఒక లిఖితపూర్వక సమాధానంలో ఆయన చెప్పారు. వివిధ పోలీసు విభాగాల నివేదికల ప్రకారం 15.75 లక్షలకు పైగా సిమ్ కార్డులు, 5.77 లక్షల ఐఎంఈఐ నంబర్లను కేంద్రం బ్లాక్ చేసిందని మంత్రి తెలిపారు.

# పాకిస్తాన్ ఐఎస్ఐఎస్‌తో సంబంధాలు..

### కర్ణాటకలో ఇద్దరు అరెస్ట్

**న్యూఢీల్లి ఆగస్టు 13( మహాప్రభ )**



పాకిస్తాన్ ఐఎస్ఐఎస్ ఉగ్ర సంస్థతో సంబంధాలు కలిగిన ఇద్దరు వ్యక్తుల్ని యూపీ పోలీసులు కర్ణాటకలో అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగం ఇచ్చిన సమాచారంతో ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (యూపీ ఏటీఎస్) రంగంలోకి దిగింది. యూపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పాకిస్తాన్‌లోని ఐఎస్ఐఎస్ సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నారని, ఆ సంస్థ కోసం వీరు పని చేస్తున్నారనేది ఈ సమాచారం.దీంతో వారిపై నిఘా పెట్టిన ఏటీఎస్ పోలీసులు వారు కర్ణాటకలోని కలబురాగి జిల్లాలోని, ఉప్పలం గ్రామ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. స్థానికంగా ఒక ఫ్యాక్టరీలో పని చేస్తూనే, పాక్ కోసం కూడా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరి కోసం కర్ణాటక వెళ్లిన ఏటీఎస్ పోలీసులు నిందితుల్ని అరెస్టు చేశారు. వీరిని యూపీకి చెందిన మొహమ్మద్ సమీర్, సల్మాన్‌గా గుర్తించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారిస్తున్నారు. పాకిస్తాన్‌కు, ఐఎస్ఐఎస్‌కు గల సంబంధాలపై ఆరా తీస్తున్నారు. వారితో ఎలా సంప్రదింపులు జరుపుతారు, వారి లక్ష్యాలు వంటి వివరాలపై ప్రశ్నిస్తున్నారు. నిందితుల దగ్గరి నుంచి కొన్ని మ్యాప్స్ కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ మ్యాప్స్ ఎందుకున్నాయి.. వాటితో ఏం చేయదలచుకున్నారు అనే విషయాల్ని కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితులపై యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదైంది.

## ఆర్కిటిక్ సముద్రంలోని ఎన్ఎస్ఆర్

# రూటుపై భారత్ ఆసక్తి


**మాస్కో ఆగస్టు 13( మహాప్రభ )**
ఆర్కిటిక్ సముద్ర మార్గానికి సంబంధించిన నార్తర్న్ సీ రూట్(ఎన్ఎస్ఆర్) రూటుపై భారత్ ఆసక్తిగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుతం పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో తమతో వాణిజ్యాన్ని పెంపొందించుకునేందుకు భారత్ ఆసక్తిగా ఉన్నట్లు పుతిన్ పేర్కొన్నారు. ఆర్కిటిక్ సముద్ర మార్గంలో షిప్పింగ్ కోసం చైనా, ఇండియా లాంటి దేశాలు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈశాన రష్యా భాగంలో జరుగుతున్న సైనిక విన్యాసాలను వీక్షించేందుకు జపాన్ సమీపంలో ఉన్న దీవులకు పుతిన్ వెళ్లారు. ఆర్కిటిక్ రీజియన్స్ ఫోరమ్‌లో భారత్ కీలక భాగస్వామి అన్నారు. చెన్నై నుంచి వ్లాదివోస్తోక్ కారిడార్‌ను .. ఎన్ఎస్ఆర్ రూట్‌లో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. చెన్నై–వ్లాదివోసతోక్ కారిడార్ సుమారు 10,380 కిలోమీటర్ల దూరం ఉంటుంది. తూర్పు ఆసియా, యూరోప్ మధ్య షార్టెస్ట్ షిప్పింగ్ రూట్‌గా




ఎన్ఎస్ఆర్‌ను భావిస్తున్నారు.ఎన్ఎస్ఆర్ మార్గం ద్వారా భారత్ వ్యూహాత్మకంగా లాభం పొందే ప్రయత్నం చేస్తున్నట్లు రష్యా అంచనా వేస్తున్నది. చైనాను ఎదుర్కొనేందుకు భారత్ ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు చైనాపై రష్యా ఆధారపడుతోంది, కానీ ఇండియా–చైనా మధ్య ఇటీవల రిలేషన్ దెబ్బతిన్నది. మరో వైపు చైనాపైనే పాకిస్థాన్ కూడా ఆధారపడుతోంది. ఇటీవల చైనా, పాక్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా ప్రతిపాదిత ఎన్ఎస్ఆర్ సముద్ర మార్గానికి ఇండియా మద్దతు ఇవ్వాల్సి వస్తున్నది. అమెరికా హెచ్చరికలను పక్కనపెట్టి రష్యా వద్దే భారత్ ఇంధనం కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. అమెరికా, భారత్ మధ్య వైరుధ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా ప్రతిపాదిత వాణిజ్య మార్గం కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయి. చెన్నై=వ్లాదివోస్తోక్ మార్గం ద్వారా ప్రయాణిస్తే 12 రోజుల్లో 5647 నాటికల్ మైళ్లను చేరుకోవచ్చు. సీ ఆఫ్ జపాన్, ఈస్ట్ చైనా సీ, సౌత్ చైనా సీ, మలాకా జలసంధి మార్గంలో నౌకలు వెళ్తాయి. అయితే గతంలో ముంబై నుంచి పీటర్స్‌బర్గ్ మధ్య సముద్రం మార్గం ఉండేది. ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం, బాల్టిక్ సముద్రం మీదుగా ప్రయాణిస్తు సుమారు 8675 నాటికల్ మైళ్ల దూరాన్ని దాటేందుకు 32 రోజుల సమయం పడుతుంది. అయితే ప్రతిపాదిత ఎన్ఎస్ఆర్ మార్గం వల్ల చాలా సమయం ఆదా అవుతుందని భారత్ భావిస్తున్నట్లు పుతిన్ తెలిపారు.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా కుట్ర..

**న్యూఢీల్లి ఆగస్టు 13( మహాప్రభ )**
ఢిల్లీ లోని ఎర్రకోట వద్ద కారులో జరిగిన పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ 'అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ ' కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. AQIS ను ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తున్నది.తాలిబన్ల నుంచి AQIS కు మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తన నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దాంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు




వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు AQIS ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతావర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. AQIS తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో AQIS కు పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ముగిసిన కన్వర్ యాత్ర..

### హరిద్వార్‌లో పేరుకుపోయిన 7,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు

**న్యూఢీల్లి ఆగస్టు 13( మహాప్రభ )**
ఏడాదికి సంబంధించిన కన్వర్ యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగా దాదాపు ఐదు కోట్ల మంది శివ భక్తులు దేవభూమిగా పిలిచే ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ సందర్శించారు. అక్కడి పవిత్ర గంగా జలాల్ని తీసుకెళ్లారు. అయితే, ఈ యాత్ర సందర్భంగా హరిద్వార్‌లో భారీగా చెత్త పేరుకుపోయింది. కోట్లాది మంది భక్తుల రాకతో ఇక్కడి అనేక ప్రాంతాలు భారీ వ్యర్థాలతో నిండిపోయాయి. దీనికి సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. అధికారుల అంచనా ప్రకారం.. హరిద్వార్‌లోని గంగా నది ఘాట్‌లైన హర్ కి పూరి సహా పలు ఘాట్‌లలో భారీ వ్యర్థాలు పేరుకుపోయాయి.దాదాపు 7,000 మెట్రిక్ టన్నుల



వ్యర్థాలు పేరుకుపోయినట్లు అధికారుల అంచనా. వేలకొలది వాటర్ బాటిళ్లు, మల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, దుస్తులు, అండర్‌వేర్స్, చెప్పులు వంటివి ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. పరిసరాల్ని అపరిశుభ్రంగా, వ్యర్థాలతో నిండి, దుర్వాసన వస్తున్నాయి. మహిళలు దుస్తులు మార్చుకునే రూమ్లు కూడా చెత్తతో నిండిపోయాయి. దీంతో ఇప్పుడు ఈ వ్యర్థాల నిర్వహణ ఇప్పుడు అక్కడి అధికారులకు సవాలుగా మారింది. వ్యర్థాలు సేకరించడం, వేరు చేయడం, పరిసరాల్ని శుభ్రం చేయడం కోసం యుద్ధప్రాతిపదికన పని చేయాల్సి వస్తోంది. వ్యర్థాల సేకరణ కోసం 1,000 మంది వరకు పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారని స్తానిక మున్సిపల్ కమిషనర్ నంద కుమార్ తెలిపారు.ఆగష్టు 12 నుంచి వ్యర్థాల తొలగింపు కొనసాగుతోందని, ఆగష్టు 18 వరకు సాగుతుందని వెల్లడించారు. వ్యర్థాల సేకరణ, రవాణా కోసం 80 వాహనాల్ని వినియోగిస్తున్నామని వివరించారు. ఈ వ్యవహారం మొత్తాన్ని డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ల ద్వారా వ్యర్థాల్ని గుర్తించి, తొలగిస్తున్నామని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్తలు, కార్యకర్తలు కూడా ఇందులో భాగస్వాములయ్యారు.

## నా మాటకు విలువ లేదు..

# అందుకే పార్టీ మారా..!

**న్యూఢీల్లి ఆగస్టు 13( మహాప్రభ )**
ఆమ్ ఆద్మీ పార్టీ లో తన మాటకు విలువ లేకపోవడంతోనే బీజేపీ లో చేరినట్లు మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తెలిపారు. క్రీడల అభివృద్ధి కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానని, తన సూచనలు పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హర్భజన్‌తోపాటు మరో ఆరుగురు ఆప్ ఎంపీలు బీజేపీలో చేరారు. ఈ నేపథ్యంలో హర్భజన్ తాజాగా వివరణ ఇచ్చారు.రాజ్యసభలో ఆప్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో క్రీడలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తానని ఆయనతో చెప్పాను. రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టంచేశా' అని చెప్పారు. పంజాబ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు అవకాశం రావడంతోనే ఆప్‌లో చేరానని అన్నారు. కానీ నా ఆలోచనలను ఎవరూ పట్టించుకోలేదని, కనీసం ఒక్క సూచననైనా అమలు చేసి ఉంటే పార్టీని వీడేవాడిని కాదని హర్భజన్



చెప్పారు. పార్టీని వీడిన తర్వాత ఆప్ తనను విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేయడంపై స్పందిస్తూ.. 'నేను ఎవరిని మోసం చేశాను..? దేశ ప్రజలు నన్ను క్రికెట్ కారణంగా ప్రేమించారు. పంజాబ్ కోసం మీరు ఏం చేశారో చెప్పాలి. నన్ను ద్రోహి అని పిలిచినంత మాత్రాన నేను ద్రోహిని కాను' అని అన్నారు. పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రంగా ఉందని హర్భజన్ ఆందోళన వ్యక్తంచేశారు. మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. ఒకప్పుడు క్రీడల్లో పంజాబ్ అగ్రస్థానంలో ఉండేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పంజాబ్‌లోని ఓ చిన్న గ్రామం నుంచి ఒకప్పుడు తొమ్మిది మంది హాకీ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు విపరీతంగా పెరగడంతో యువత తీవ్రంగా నష్టపోతోందన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

-ఆహార ప్యాకెట్లపై హెచ్చరికలు తప్పనిసరి!
-కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక
-చక్కెర, ఉప్పు, కొవ్వు వివరాలు స్పష్టంగా చూపించాలి
-ప్రజల ఆరోగ్యం కంటే కార్పొరేట్ ప్రయోజనాలా?
-రెండు వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం
-వినియోగదారులకు తెలుసుకునే హక్కు ఉందన్న ధర్మాసనం
-లేబుళ్ల అమలులో జాప్యంపై అసంతృప్తి
-'మీరు చేయకపోతే మేమే చేస్తాం'
-పిల్లల ఆరోగ్య పరిరక్షణే ప్రధానమన్న కోర్టు
-ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై ప్రశ్నల వర్షం



న్యూఢిల్లీ

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## భూములు కనిపిస్తే అమ్మేయడమేనా?

మొదటి తరువాయి

తెలిపారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ కోర్టు మెట్లు ఎక్కిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అదే భూమిపై థర్డ్ పార్టీ హక్కులు సృష్టించేలా వేలానికి ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాటనా? అని పేర్కొన్నారు. జీవో నెంబర్ నాలుగు, సర్వే నెంబర్ 83ను హెరిటేజ్ భూమిగా గుర్తించినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని అడిగారు. సీఎం అనుయాయులకు మేలు చేసేందుకేనా? అని ప్రశ్నించారు. ఇదే సర్వే నెంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు రూ.237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్బీఐ కోర్టుకు ఎక్కిందని గుర్తు చేశారు. దీంతో కోర్టు అంక్షితలు వేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. అయినా అదే సర్వే నెంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏంటని? ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా?అని అడిగారు. భూమిపై యాజమాన్య వివాదాలు ఈ భూమిపై యాజమాన్య వివాదాలు ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. హెరిటేజ్ అంశం, వక్ఫ్ హక్కుల అంశం కూడా ఉన్నాయని వివరించారు. అనేక కోర్టు వివాదాలున్నాయని పేర్కొన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నప్పుడు భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకని ప్రశ్నించారు. రూ.రెండు వేల కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిచ్చారని అడిగారు. ఈనెల 17, 21 తేదీల్లో జరగనున్న టీజీఐఐసీ వేలాలను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 83కి సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని సూచించారు.

## నాపైనే కుల వివక్ష

మొదటి తరువాయి

తర్వాత ఆ ప్రదేశం అపవిత్రమై పోయిందంటూ బీజేపీ అనుబంధ వర్గాలు శుద్ధి కార్యక్రమం నిర్వహించాయి. ఇది సోషల్ మీడియాతో పాటు ప్రధాన స్రవంతి మీడియాలోనూ వైరల్‌గా మారింది. దీంతో ఈ ఘటన తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. కాంగ్రెస్, బీజేపీల పరస్పర విమర్శలకు దారితీసింది. ఖర్గే ప్రసంగించిన ప్రాంతంలో బీజేపీతో కలిసి శ్రీరామ్ సేన శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఘటనపై ఖర్గే గురువారం రాజ్యసభలో ఆవేదనతో ప్రసంగించారు. హల్ద్వానీలో ఒక బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత ఒక అంటరానితనం తాలుకు చేదు అనుభవాన్ని తాను చవిచూడాల్సి వచ్చిందని మల్లికార్జున ఖర్గే అన్నారు. "దీనిని రాజకీయం చేద్దామని ఎప్పుడూ అనుకోలేదు. చాలా ఏండ్లుగా నేను పార్లమెంట్లో ఉన్నాను. ప్రస్తుతం రాజ్యసభలో, గతంలో దిగువ సభలో సభ్యుడిగా ఉన్నాను. ఎప్పుడూ సానుభూతిని పొందడానికి ప్రయత్నించ లేదు. నాది షెడ్యూల్డ్ కులం, నేను దళితుడినని చెప్పి సహాయం, రక్షణ కల్పించా లని ఎన్నడూ అడుగ లేదు" అని ఆయన రాజ్యసభలో తెలిపారు. "హల్ద్వానీలో నేను ప్రసంగించినప్పుడు లక్షలాది మంది ప్రజలు ఉన్నారు. నేను ఏ కులం, మతం పేరునూ ప్రస్తావించ లేదు. ప్రజల సమస్యలకు సంబంధించిన అంశా లను మాత్రమే ప్రస్తావించా. కానీ నా ప్రసంగం పూర్తయిన తర్వాత మీరు (బీజేపీ అనుబంధ సభ్యులు) శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను అవమానించడానికి ప్రయత్నించారు. అస్పృశ్యత తాలుకు బాధను మీరు అనుభవం లోకి తెచ్చారు. ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి? రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షిస్తారు? నేను ప్రతిపక్ష నాయకుడిని. పోరాటం చేసే శక్తి ఉంది. పోరాడుతాను" అని వివరించారు. వేదికను శుద్ధి చేసిన వారిపై అంటరానితనం చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, అలాంటి చర్యలను బీజేపీ ఎంతమాత్రమూ ప్రోత్సహించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. దీనిపై దర్యాప్తు చేయిస్తామని ఆయన హామీనిచ్చారు.

## అంబులెన్స్ ఆలస్యమైతే 10 వేల జరిమానా!

మొదటి తరువాయి

దగ్గరలోని దవాఖానకు బాధితులను చేర్చాలని సూచించింది. దీన్ని ఉల్లంఘించిన వారికి రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశముందని చెప్పింది. 10 కిలోమీటర్ల పరిధి దాటిన ప్రమాదాల్లో అంబులెన్స్ చేరుకోవాల్సిన సమయం దామాషా ప్రకారం పెరుగుతుందని.. ఇది జీపీఎస్ డేటా/ఐఎమ్ఎస్ కేర్ డ్యాష్ బోర్డ్ ద్వారా ధ్రువీకరణ అవుతుందని స్పష్టం చేసింది. ఎమర్జెన్సీ టికెట్‌ను తిరస్కరిస్తే రూ.10 వేలు జరిమానా విధిస్తామని వెల్లడించింది. ఒప్పందాల్లో భాగంగా పరికరాలు, మందులు, సిబ్బందిని సమకూర్చని సంస్థలకు రూ.10 వేల జరిమానా వేస్తామని తెలియజేసింది. తాజా మార్గదర్శకాలను ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ప్రాంతీయ అధికారులు కట్టదిట్టంగా అమలు చేయాలని ఆదేశించింది. ఇప్పటికే జాతీయ రహదారులపై వివిధ సేవల కోసం 1033 హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఎన్‌హెచ్ఏఐ నిర్వహిస్తున్నది.

# 'ఇందిరమ్మ ఇండ్లు' టవర్స్‌కు శ్రీకారం

మొదటి తరువాయి

రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి అని సీఎం అన్నారు. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించామన్నారు. ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, స్వయం సహాయక సంఘాలకు రూ. 65 వేల కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని అన్నారు. కడుపులో విషం పెట్టుకుని అట్ డ్రైవర్లను రెచ్చగొట్టి ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా వెనక్కి తగ్గేదేలని బిఆర్ ఎస్ సుద్దేసించి అన్నారు. ఆడ బిడ్డలను బస్సులకు యజమానులను చేశామని, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించేందుకుడు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చామన్నారు. ఒకవైపు గత



ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. డబ్బా ఇండ్ల వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు, పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టిందని, మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటా నని సీఎం అన్నారు. 22 ఎ విషయంలో మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది అని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో మీకు ఆందోళన అవసరం లేదని, సోషల్ మీడియాలో కొందరు చేసే అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దు అని సీఎం అన్నారు. పదేళ్ల వారి పాలన.. రెండేళ్ల మీ తమ్ముడి పాలనను బేరీజు వేసుకోండి అని కోరారు. నాకు వయసు ఉంది.. ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది.. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని అన్నారు. కొంతమంది దుర్మార్గులు రాష్ట్రంలో కరువు రావాలని క్షుద్ర పూజలు చేశారనీ, అయినా దేవుడు మన వైపు ఉన్నాడనీ.. వర్షాలు కురిపించాడనీ తెలిపారు. మంచి మనసుతో అభివృద్ధి చేయాలన్న మా సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉందన్నారు. కుటిల బుద్ధితో క్షుద్ర పూజలు చేసే వారికి అది తిరిగి వారినే అష్ట దిగ్బంధనం చేస్తుందని విమర్శించారు. మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలు.. ముస్తాబైన ఎర్రకోట

న్యూఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆగస్టు 15న ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలను 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు', 'వికసిత్ భారత్‌ఏ2047 కోసం యువశక్తి' అనే ప్రధాన థీమ్‌లతో నిర్వహించనున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గీతం ప్రాధాన్యాన్ని గుర్తుచేయడంతో పాటు, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో యువత పాత్రను చాటిచెప్పేలా కార్యక్రమాలను రూపొందించారు. జ్ఞానపథ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలు ఈసారి వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సుమారు 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు వందేమాతరం ఆకృతిలో కూర్చోనున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 5 వేల మంది ప్రత్యేక ఆహ్వానితులు ఎర్రకోటలో జరిగే వేడుకలను ప్రత్యక్షంగా



వీక్షించనున్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా వీరిని ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. వేడుకలకు వచ్చే ఆహ్వానితులు, సందర్శకుల సౌకర్యార్థం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెట్రో ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సంప్రదాయ ఆహ్వాన పత్రికలకు బదులుగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఈ-ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. దీంతో కార్యక్రమానికి హాజరయ్యే వారికి ప్రవేశ ప్రక్రియ సులభతరం కానుంది. మరోవైపు ఎర్రకోట పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, అతిథుల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. భారీ సంఖ్యలో ప్రజలు, ఆహ్వానితులు హాజరుకానున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వేడుకలు ముగిసిన వెంటనే ఎర్రకోట పరిసరాల్లో 'స్వచ్ఛత ప్రచారం' చేపట్టనున్నారు. చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. మొత్తంగా జాతీయ స్ఫూర్తి, వందేమాతరం వారసత్వం, యువశక్తి, అభివృద్ధి లక్ష్యాలను ప్రతిబింబించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## పార్లమెంటులో 12 బిల్లులు ఆమోదం

-వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు పార్లమెంట్ ఆమోదం
-11 బిల్లులు చర్చ లేకుండానే లోక్‌సభలో ఆమోదం
-నీట్ అవకతవకల బిల్లుపైనే ఉభయ సభల్లో విస్తృత చర్చ
-మోడీ, షా వైఖరితో స్తంభించిన సభలంటూ ప్రతిపక్షాల విమర్శ
-లోక్‌సభ ఉత్పాదకత 19%, రాజ్యసభ 39%గా నమోదు



న్యూఢిల్లీ బ్యూరో

జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ 12 బిల్లులను ఆమోదించింది. వీటిలో ఒక బిల్లుపై మాత్రమే ఉభయ సభలలో కూలంకషంగా చర్చ జరిగింది. నీట్ లీక్ తరువాత విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు ప్రవేశపెట్టిన 'పబ్లిక్ పరీక్షల అవకతవకల నివారణ (సవరణ) బిల్లు'పై లోక్‌సభలో 10 గంటల 54 నిమిషాలు, రాజ్యసభలో 6 గంటల 39 నిమిషాలు చర్చ జరిగింది. లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ చర్చకు వచ్చిన ఏకైక బిల్లు ఇదే. ఈ బిల్లు మినహా, మరే ఇతర బిల్లుపైనా ఏ సభలోనూ కూలంకషంగా చర్చ జరగలేదు. లోక్‌సభ 11 బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించింది. ఈ బిల్లులలో తొమ్మిదింటిపై సంబంధిత మంత్రులు మాత్రమే మాట్లాడారు. ?కీలకమైన అంశాలపై వివరణలు ఇవ్వని కేంద్ర ప్రభుత్వ దుస్సాహసానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఉభయ సభలలో తీవ్రంగా నిరసన తెలుపుతుండగా... కేంద్ర ప్రభుత్వం మాత్రం చర్చ లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదించడంలో నిమగ్నమైంది. 'మ్యాగీ నూడుల్స్ తయారు చేసినంత సులభంగా' కేంద్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదిస్తుందన్న తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరిక్ ఓ'బ్రియన్ విమర్శను వర్షాకాల సమావేశాల గణాంకాలు కూడా ధృవీకరిస్తున్నాయి. 1969 జనన, మరణాల నమోదు చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన ముఖ్యమైన బిల్లుపై లోక్‌సభలో ఎలాంటి చర్చా జరగలేదు. మరోవైపు, రాజ్యసభలో కేవలం 50 నిమిషాలు మాత్రమే చర్చ జరిగింది. ప్రతి ఎంపీకి కేటాయించిన సగటు సమయం మూడు నిమిషాలు మాత్రమే. విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు (ఎఫ్‌సీఆర్ఏ)ను అధ్యయనం, నివేదిక కోసం సంయుక్త సభా సంఘాని (జేపీసీ)కి నివేదించారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ సామర్థ్యం 19 శాతంగా, రాజ్యసభ సామర్థ్యం 39 శాతంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అనవసరమైన ప్రతిపక్ష నిరసనలు ఉభయ సభల సామర్థ్యాన్ని దెబ్బతీశాయని కూడా మంత్రి ఆరోపించారు. అయితే, కీలకమైన అంశాలపై వివరణ ఇవ్వడానికి, చర్చలు జరపడానికి సిద్ధంగా లేని కేంద్ర ప్రభుత్వం, వర్షాకాల సమావేశాలను నిరసనల సముద్రంలో ముంచివేసిందని ప్రతిపక్షాలు ఎత్తి చూపాయి. ?ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత, 2016లో పెద్ద నోట్ల రద్దు అనంతరం జరిగిన నిరసనల కారణంగా వర్షాకాల సమావేశాలు పూర్తిగా రద్దయ్యాయి. లోక్‌సభ తనకు కేటాయించిన సమయంలో కేవలం 15 శాతం, రాజ్యసభ 18 శాతం మాత్రమే పనిచేశాయి. 2018 బడ్జెట్ సమావేశం, 2021 వర్షాకాల సమావేశం, 2023 బడ్జెట్ సమావేశాలు కూడా భారీ నిరసనలతో దెబ్బతిన్నాయి.

## చీకట్లో బంగ్లాదేశ్..

మొదటి తరువాయి

అమలవుతున్నాయి.దేశంలో 18,000 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, ఉత్పత్తి మాత్రం 13,000 వాట్లకు తక్కువగానే ఉంది. అసలే, అక్కడి ప్రజలు ప్రస్తుతం తీవ్రమైన ఎండ, ఉక్కపోతలతో అల్లాడతున్నారు. అలాంటి పరిస్థితుల్లో విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలో స్థానిక విద్యుత్ పంపిణీ కేంద్రాలైన పవర్ స్టేషన్లపై, అధికారులపై ప్రజలు దాడులు చేస్తున్నారు. దీంతో పవర్ స్టేషన్ల వద్ద రక్షణ కల్పించాల్సిందిగా పోలీసుల్ని ప్రభుత్వం ఆదేశించింది. విద్యుత్ కోతను ఎదుర్కొనేందుకు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా తగ్గించివేసింది. అలాగే, రాజధాని ఢాకాతోపాటు అనేక నగరాల్లో షాపులు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్ అన్నీ రాత్రి 8.00 గంటలకే మూసేయాలని ఆదేశించింది. రైతులు కూడా తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రైతులు, వ్యాపార సంస్థల యజమానులు, పరిశ్రమలు విద్యుత్ కొరత ప్రభావానికి గురవుతున్నాయి. ఈ విద్యుత్ సంక్షోభానికి కారణం చమురు కొరత. తగినంత చమురు లేకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతోంది. బంగ్లాదేశ్ 90 శాతం చమురును, 30 శాతం గ్యాస్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అయితే, విదేశాల నుంచి తగినంత చమురు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో సాయం చేయాల్సిందిగా ఇండియాను బంగ్లాదేశ్ కోరింది.

## భారత్‌ను కప్పేసిన నైరుతి మేఘాలు



న్యూఢిల్లీ:

భారతదేశం మీద దట్టమైన నైరుతి వర్షపు మేఘాలు కమ్ముకున్నట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. రుతుపవనాలు మళ్లీ బలం పుంజుకుంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన కొత్త అల్పపీడన వ్యవస్థ తూర్పు, మధ్య భారత ప్రాంతాల వాతావరణాన్ని ప్రభావితం చేస్తోంది. దీని వల్ల దేశంలోని విస్తార ప్రాంతాలు మందపాటి మేఘాల కింద ఉన్నాయని ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టు 13న యూమెట్ శాట్, ఇస్రో ఇన్సాట్ ఉపగ్రహాలు తీసిన చిత్రాల్లో అరేబియా సముద్రం నుంచి మధ్య భారతదేశం, గంగా మైదానాలు, ఈశాన్య ప్రాంతాల వరకు విస్తరించిన విస్తృత మేఘావరణం కనిపిస్తోంది. ఉత్తర బంగాళాఖాతం, తూర్పు భారతదేశం, బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాల్లో అత్యంత తీవ్రమైన మేఘ సమూహాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఇక్కడ కొత్తగా ఏర్పడిన అల్పపీడన ప్రాంతం తేమను లోతట్టు ప్రాంతాల్లోకి లాగుతోంది. భారత వాతావరణ శాఖ ప్రకారం పశ్చిమ బెంగాల్ - బంగ్లాదేశ్ తీరం వద్ద ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. ఈ వ్యవస్థ లోతట్టు ప్రాంతాల్లోకి కదులుతూ ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పరిసర రాష్ట్రాల్లో విస్తృత వర్షపాతం కొనసాగే అవకాశం ఉంది. ఉపగ్రహ చిత్రాల్లో తూర్పు భారతదేశంపై లోతైన సంవాహన మేఘాలు, చల్లని మేఘ శిఖరాలు కనిపిస్తున్నాయి. ఇవి తీవ్రమైన ఉరుములు, భారీ వర్షాలకు సంకేతాలు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ ఈశాన్య ప్రాంతాల్లో కూడా పెద్ద మేఘ రాశులు కనిపిస్తున్నాయి. దీని వల్ల రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుకుగా ఉందని స్పష్టమవుతోంది. వాతావరణ అధికారులు అనేక రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒడిశా ప్రత్యేక దృష్టిలో ఉంది.

## మంత్రి తుమ్మల రికార్డు

మొదటి తరువాయి

ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా ఆయనకే దక్కుతూ వస్తోంది. ఇప్పటికే 20 సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న తుమ్మల, ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వ సారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇదొక సరికొత్త ఘట్టంగా నిలవనుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయడం ప్రతి నేతకూ లభించే గౌరవం. అలాంటి అరుదైన అవకాశం తుమ్మలకు ఏకంగా 20 సార్లు దక్కడం, ఈనెల 15న 21వ సారి దక్కనుండటం విశేషం.

నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన, ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా వ్యవహరించారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, ప్రొహిబిషన్-ఎక్సైజ్, మేజర్-మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా

రాజకీయ ప్రస్థానంలో తుమ్మల ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సుదీర్ఘ ప్రజాజీవితంలో మంత్రిగా ఉన్న దాదాపు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఘనత ఆయనది.

వేర్వేరు రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల మార్పుల మధ్య కూడా ఈ గౌరవం వరుసగా దక్కడం ఆయన సుదీర్ఘ ప్రజాజీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

20 సార్లు జెండా ఆవిష్కరణ.. ఇప్పుడు 21వ సారి

1985 నుంచి 1989 వరకు ఐదుసార్లు, 1995 నుంచి 2003 వరకు తొమ్మిదిసార్లు, 2015 నుంచి 2018 వరకు నాలుగుసార్లు, 2024, 2025 సంవత్సరాల్లో ఒక్కోసారి చొప్పున ఇప్పటివరకు 20 సార్లు తుమ్మల నాగేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 15న 21వ సారి ఈ గౌరవం దక్కడం రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 15న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

# వైభవంగా శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు

**దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సతీ సమేతంగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రములు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు**



**దేవరకద్ర ఆగస్టు 13 మహా ప్రభ**

దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సతీసమేతంగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రములు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం దేవాలయానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర రేకుల షెడ్డు ను రుబ్బన్న కట్ చేసి ప్రారంభించారు అనంతరం జీకే మాస్టర్ షోటో ఖాన్ కరాటే. డూ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టు ప్రధానోత్సవాన్ని కార్యక్రమంలో పాల్గొని కరాటే లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు కరాటే బెల్ట పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజల్ రెడ్డి దేవరకద్ర మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి వెంకటాయపల్లి గ్రామ సర్పంచ్ చక్కరి రామాంజనేయులు ఉప సర్పంచ్ మోహన్ గ్రామ పెద్దలు కుమ్మరి సత్యన్నా బంగారి కాష్ అన్న కుమ్మరి వీరేష్ నక్క రఘు పూజారి పరమేష్ నక్క బాలరాజు జంగం శేఖరయ్య కుమ్మరి కిషోర్ నరసింహ సాగర్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం..



**మెదక్ జిల్లా -13ఆగస్ట్ (మహాప్రభ )**

మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం – బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వికసిత భారత్ లక్ష్యంగా గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డాక్టర్ అంజి రెడ్డి మరియు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణిత ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

**ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశ్యం**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, ప్రాంతాలు, మతాలు, కులాలకు అతీతంగా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుతూ జాతీయ జెండాల ప్రదర్శనతో జిల్లా కేంద్రం దేశభక్తి భావంతో మార్మోగింది.

**పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చిన్మనమైన శ్రీనివాస్, ఈర్ల రంజిత్ రెడ్డి, నిజాంపేట మాజీ జెడ్పిటిసి పంజాబీ చెయ్, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ శంకర్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షుడు నాయని ప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్ పాల్గొన్నారు. అలాగే మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు వెల్మకొండ రాజేందర్, కార్యదర్శి సాధు అశోక్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, బట్ల జనార్ధన్, పట్లోళ్ల మల్లిక, గ్యాన్పింగ్, హర్ ఘర్ తిరంగా కో-కన్వీనర్స్ రాజేశ్వరి, సాయి సన్నీ, మెదక్ కౌన్సిలర్లు అఖిల, భారత్, పప్పా, రాజమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు మెదక్ జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కదం తొక్కిన రాజాపూర్ గ్రామస్థులు



**రామగిరి, ఆగస్ట్ 13 (మహాప్రభ)**

సింగరేణి ఆర్జీ త్రీ ఏరియా ఓసీపీ-2 విస్తరణలో భాగంగా చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియపై రాజాపూర్ గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.గ్రామానికి సంబంధించిన పీడీ (ప్రొసీడింగ్స్) విడుదల చేసినప్పటికీ అందులో అవకతవకలు చోటుచేసుకున్నాయని,సుమారు 122 ఇండ్లు జాబితాలో లేకుండా మినహాయించబడ్డాయని గ్రామస్థులు ఆరోపించారు.ఈ నేపథ్యంలో ఈ రోజు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఓసీపీ-2 క్వారీ ప్రాంతానికి చేరుకుని నిరసన చేపట్టారు.క్వారీలో జరుగుతున్న పనులను నిలిపివేయడంతో పాటు గనిలో పనిచేస్తున్న వాహనాలను అడ్డుకుని నిలిపివేశారు.

# చిన్నపాటి వర్షాలకే చిటికి మాటికి విద్యుత్ అంతరాయం

**-వాడి వేడిగా సాగిన పాపన్నపేట మండల సమీక్ష సమావేశం**

**- పలు అధికారుల తీరుపై ఆగ్రహించిన సర్పంచులు**




**మెదక్ జిల్లా -13ఆగస్టు(మహాప్రభ ).**

మండల కేంద్రమైన పాపన్నపేటలో గురువారం నిర్వహించిన గ్రామఅభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశం వాడీ వేడిగా సాగింది.మెదక్ డిపిఓ యాదయ్య,ఎంపీడీవో విష్ణువర్ధన్ సమక్షంలో జరిగిన సమీక్ష సమావేశంలో మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. పలు శాఖల అధికారులు ఫోన్ చేస్తే స్పందించడం లేదని,సమస్య పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలు గ్రామాల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యుత్తు శాఖ ఏఈ,లైన్మెన్ లు గ్రామంలో ఉండటం లేదని,సమస్య ఉందని ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఆగ్రహించారు.చిన్నపాటి వర్షం వస్తే గ్రామంలో కరెంటు పోతుందని వారు దుయ్యబట్టారు.దీంతో పాటు చిన్న చిన్న గ్రామాలకు సైతం రూ. లక్షల్లో కరెంట్ బిల్లు వస్తే ఎలా చెల్లించాలని ప్రశ్నించారు.కుర్తివాడ గ్రామంలో 5 వార్డులకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని,సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని గ్రామ సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్ ఆరోపించారు.పాపన్నపేట, రామతీర్థం గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రతరంగా ఉందని,నూతన ట్యాంకులు నిర్మించి పైపులైను వేసి సమస్య పరిష్కరించాలని సర్పంచులు పావని నరేందర్ గౌడ్,సాయి రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో 699 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా,173 ఇండ్లు పూర్తయ్యాయని, మిగతావి ప్రోగ్రెస్ లో ఉన్నాయన్నారు. ఏడుపాయల కమాన్, యూసఫ్ పేట,కొత్తపల్లి బ్రిడ్జ్,ఎల్లాపూర్ బ్రిడ్జ వద్ద వర్షం కురిస్తే రహదారిపై ప్రయాణించలేని పరిస్థితి ఉందని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకుపోగా,సమస్య పరిష్కరించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్ అండ్ బీ అధికారి పేర్కొన్నారు. ముఖ్యంగా దాలాపూర్ గ్రామంలో పలు రైతులకు భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడంతో యూరియా కు నానా పాట్లు పడుతున్నామన్నారు. అట్టి భూములకు సంబంధించి కోర్టు కేసులు ఉండడంతో సమస్య ఉందని అధికారి వెల్లడించారు. మండలంలో మొత్తం 26,456 ఎకరాలు సాగులో ఉండగా, అందులో 26,212 ఎకరాల్లో వరి సాగు చేశారని,మిగతా వాటిలో పత్తి, కంది, పెసరు, చెరుకు,కూరగాయలు పండిస్తున్నారని ఏవో పి.శ్రీనివాస్ రాజు పేర్కొన్నారు. ఏడుపాయల కమాన్ నుంచి ఏడుపాయల వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, మండలంలోని పలు గ్రామాలకు సైతం రహదారి నిర్మాణాలకు నిధులు కేటాయించబడిందని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు. హామ్ గ్రాండ్ కింద సైతం పలు గ్రామాల్లో రహదారులు నిర్మించనున్నామని పేర్కొన్నారు.రామతీర్థం లోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు లేక మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ సాయిరెడ్డి సభ దృష్టికి తీసుకెళ్ళగా, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. గ్రామంలో చాలా మందికి జాబ్ కార్డులు లేవని సర్పంచులు ఇన్చార్జి ఏపిఓ యాదగిరి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఆర్టీసీ అధికారులు మినహా మిగతా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్ కుమార్,ఆయా గ్రామాల సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవనికి పకడ్బందీగా ఏర్పాట్లు

**---మెదక్ ఆర్ డి ఓ రమాదేవి**



**మెదక్ జిల్లా -13ఆగస్ట్ (మహాప్రభ ).**

ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మెదక్ ఆర్ డి ఓ రమాదేవి అన్నారు. గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్న ఏర్పాట్లను ఆర్డీవో పరిశీలించారు. వేడుకలు నిర్వహించనున్న ప్రదేశాన్ని సందర్శించి వేదిక, పరేడ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీవో సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ నవీన్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు సంబంధిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

**నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యులు జతోతు హుస్సేన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన టిఐసిసిఐ తెలంగాణ చాప్టర్ సభ్యులు.**



**మేడిపల్లి, ఆగస్ట్ 13 (మహాప్రభ)**

గిరిజన సమస్యల పరిష్కారానికి, పారిశ్రామిక అభివృద్ధికి ఉపాధి అవకాశాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యులు జతోతు హుస్సేన్ హామీ ఇచ్చారు. గురువారం నాడు ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలంగాణ చాప్టర్ ప్రతినిధులు జతోతు హుస్సేన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలు, హక్కులు, విద్య, ఉపాధి మరియు పారిశ్రామికంగా గిరిజనులను ఎలా ప్రోత్సహించాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. టిఐసిసిఐ ప్రతినిధులు విన్నవించిన వివిధ అంశాలపై సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి గిరిజన పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గిరిజన సమాజ సమగ్ర అభ్యున్నతే ధ్యేయంగా తమ కృషి నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా టిఐసిసిఐ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో టిఐసిసిఐ తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ ధారావత్, ప్రతినిధులు మంజిలాల్ ధారావత్, నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడికి రెండేళ్ల జైలు, రూ.20 వేల జరిమాన

**సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను, సిబ్బందిని అభినంధించిన మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్**




**మెదక్ జిల్లా -13ఆగస్ట్ (మహాప్రభ ).**

పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడి వేధింపులకు గురిచేసిన నిందితుడికి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డ్. వి. శ్రీనివాస రావు ఐపీఎస్ తెలిపారు.నరేష్ (27) అనే వ్యక్తి పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్ గౌడ్ జులై 2022లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో సమర్పించారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలిక సాక్ష్యం చెప్పడంలో సహకరించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు నరేష్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ ప్రవీణ్ సహకరించారని ఎస్పీ తెలిపారు. బాలికలు, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. బాధితులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వేధింపులపై వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

**---జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




**మెదక్ జిల్లా -13ఆగస్ట్ (మహాప్రభ ).**

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుండి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. జిల్లాలోని పంటల వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు , సెప్టెంబర్ మాసాలలో ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని, వరి పంటను సాగు చేస్తున్న రైతులు వరి సాగు కోసం ఎక్కువ నీరు అవసరం అవుతుందని, ఆగస్టు సెప్టెంబర్ మాసాల్లో వర్షాలు తగ్గడం వల్ల వరి పంటలు ఎండిపోయే అవకాశం ఉందని, పంటలు ఎండిపోవడం వల్ల దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లోని గ్రామ సర్పంచులకు, రైతులకు ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, విస్తరణ అధికారుల తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలపై పోరుబాట

**-పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలి.. లేదంటే ఉద్యమం ఉధృతం**

**-యూఎస్పీసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన**

**-జీవో 25ను సవరించాలి...**

**-టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్**





**పెద్దవంగర ఆగస్టు 13 (మహాప్రభ)**
ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) పెద్దవంగర మండల శాఖ డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లను వివరిస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు సోమారపు ఐలయ్య, ఎర్ర వెంకన్న, చిక్కాల సతీష్, గొడిశాల దేవదాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై తగిన స్థాయిలో దృష్టి సారించడం లేదని అన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ అంశాలపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్సీని ప్రకటించడంతో పాటు చాలాకాలంగా నిలిచిపోయిన ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. హెల్త్ కార్డుల వినియోగంలో ఉన్న ఇబ్బందులను తొలగించి అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించి ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులు కోరారు. బీఈడీ అర్హత ఉన్న ఎస్జీటీలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి అడ్డంకిగా ఉన్న జీవో నంబర్ 25ను సవరించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి
డీఎస్సీ-2008 ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు సంవత్సరంలోని అన్ని నెలలకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలకు సంబంధించిన 29 డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని అన్నారు.

జీవో 25ను సవరించాలి
బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందే అవకాశం కల్పించాలని నాయకులు కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, సర్వీస్ సంబంధిత అంశాలకు ఇబ్బందులు కలిగించే జీవో నంబర్ 25ను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా కేంద్రంలో భారీ ఆందోళన
ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కార చర్యలు చేపట్టకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని యూఎస్పీసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నెల 19న జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.
కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వల్లాల శ్రీనివాస్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, యూఎస్పీసీ మండల నాయకులు రమేష్, దయాకర్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, రాజు, యుగేందర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యం అందించాలి

**-ఎమ్మెల్యే బాలు నాయక్**



**దేవరకొండ ఆగస్టు 13( మహాప్రభ )**
దేవరకొండ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాంజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. దేవరకొండ పట్టణంతో పాటు నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు కూడా తమ వంతు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రాంజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ దేవరకొండ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆలంపల్లి నరసింహ, పద్య దేవేందర్ నాయక్, నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఎ సిరాజ్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు వెంకటేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, మైనంపల్లి సర్పంచ్ కొర్ర రామ్ సింగ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వై.ఎస్. కరుణాకర్, వైద్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ

**-ఆగస్టు 15 వరకు దరఖాస్తులకు అవకాశం**



**పెద్దవంగర, ఆగస్టు 13: (మహాప్రభ)**
చేయూత పెన్షన్ పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం చిన్నవంగర గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముస్కు పూలమ్మ, ఉప సర్పంచ్ యాసారపు రవి ఆధ్వర్యంలో పలువురు దరఖాస్తుదారులు తమ చేయూత పెన్షన్ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్కు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని, చేయూత పెన్షన్‌కు అర్హత ఉన్న అభ్యర్థులు ఆగస్టు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ కారోబార్ మధుకర్‌ను సంప్రదించి అవసరమైన వివరాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి కోరారు.

## నూతన శ్రీ తుల్జా భవాని అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేత

**-బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్.**




**దేవరకొండ డివిజన్ ఆగస్టు 13 (మహాప్రభ)**
డిండి మండలంలోని గురువారం ఉమ్మడి వీరబోయన పల్లి గ్రామ పంచాయతీ ప్రస్తుత శక్రు తండా గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జ్యా భవాని అమ్మవారి ఆలయంనికి బి. ఆర్ ఎస్.దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ దర్శించుకొని నూతన దేవాలయం నిర్మాణానికి తమ వంతు సహాయంగా కొంత నగదును అందజేశారు అనంతరం వారిని శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో శక్రూ తండా సర్పంచ్ కేతవత్ బాధ్య నాయక్, రామావత్ రెడ్యానాయక్, నారాయణ సింగ్, తావుర్య, రమేష్ నాయక్ ,దశరథ్ ,రంజిత్ తిరుపతి, నిరంజన్, దేవీలాల్, రెక్కీ లాల్,దశరథం,శివకుమార్, తండా ప్రజలు పాల్గొనారు

## గాంధారి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో సిబిఆర్ఎం సమావేశం


**-లక్ష్యాల సాధన, ఎంపిఏ ఓవర్‌డ్యూ తగ్గింపుపై చర్చ**

**-గ్రామ సంఘాలతో కలిసి ఆర్థిక అభివృద్ధికి కృషి: బ్యాంక్ సమావేశం**



**గాంధారి, ఆగస్ట్ 13 (మహాప్రభ)**
మండలం తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో సిబిఆర్ఎం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బ్యాంక్ లక్ష్యాలు, అచీవ్‌మెంట్, ఎంపిఏ, ఓవర్‌డ్యూ లేకుండా చూడాలని చర్చించారు. సభ్యులందరికీ ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని, బ్యాంక్ కార్యకలాపాలను మరింత మెరుగుపరచాలని నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్నవారు బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, క్యాషియర్, ఏపిఎం ప్రసన్న కుమార్, సిసిలు గొర్రె రాములు, శేఖర్, సౌజన్య, వివోఏలు, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షురాలు, గాంధారి గ్రామ సంఘం అధ్యక్షురాలు భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండియన్ బ్యాంక్ లో రూ.90 లక్షల విలువైన బంగారం మాయం...!!!




**మహబూబాబాద్ ఆగస్ట్ 13 (మహాప్రభ)**
సుమారు 26మంది ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారం మాయం కావడంతో ఆందోళన చెందుతున్న బ్యాంక్ ఖాతాదారులు. గుంపులు.., గుంపులుగా బ్యాంక్ కు చేరుకుంటున్న ఖాతాదారులు, ప్రజలు. అసిస్టెంట్ మేనేజర్ పైనే అనుమానాలు. ఆడిట్ లో తెలిన బంగారంమాయం ఘటన ఆందోళన లో ఖాతాదారులు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమంటున్న పోలీస్ లు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ





**తూప్రాన్. ఆగస్టు 3,(మహాప్రభ)**
తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్ తో పాటుగా నోట్ పుస్తకాలను అందిస్తూ వాళ్ళ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేటటువంటి ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగా గురువారం రోజు తూప్రాన్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు చదువుతున్నటువంటి విద్యార్థిని, విద్యార్థులందరికీ కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం నోటు పుస్తకాలను ప్రభుత్వం సప్లై చేసిన విద్యార్థులందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీ ప్రభావతి మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్నటువంటి టెక్ట్స్ బుక్స్ ను మరియు నోట్ బుక్స్ ను సరైనటువంటి విధంగా ఉపయోగించుకొని తమ యొక్క బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులందరూ వర్షాతిరేకలు వ్యక్తం చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కళాశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రిహార్సల్‌ను సమీక్షించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్.



**మెదక్ జిల్లా -13ఆగస్ట్ (మహాప్రభ ).**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించనున్న పరేడ్ ఏర్పాట్లను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ సమీక్షించారు. పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించిన ఆయన పోలీసు సిబ్బంది కమాండ్లకు అనుగుణంగా చేస్తున్న కదలికలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. పరేడ్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరూ పూర్తి ఉత్సాహంతో, క్రమశిక్షణతో పాల్గొనాలని సూచించారు. కవాతులో అడుగులు, టర్నింగ్‌లు, కమాండ్లకు అనుగుణంగా కదలికలు ఒకే విధంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సిబ్బంది టర్న్‌అవుట్ కూడా ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. వేడుకల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు.

## ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావు రామాయంపేటలోనే మెరుగైన వైద్యంతో ప్రాణాపాయ శిశువు కోలుకున్నాడు




**రామాయంపేట ఆగస్టు 13 మహాప్రభ**
సకాలంలో ప్రత్యేక చికిత్స అందించి వైద్యులు ప్రాణాలు కాపాడారు. చికిత్స అనంతరం బాబు పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామానికి చెందిన . పాల్వూరి శోభ చంటి దంపతులకు ఈ నెల 5న మెదక్‌లోని ఓ ఆసుపత్రిలో బాబు జన్మించాడు. పుట్టిన 2 రోజులకే బాబు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కానీ తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తీసుకెళ్లకుండా రామాయంపేట పట్టణంలోని రాజరాజేశ్వరి పిల్లల ఆసుపత్రిలికి తీసుకొచ్చారు. ఈ నెల 7న డాక్టర్ ప్రదీప్ రావు నేతృత్వంలోని వైద్య బృందం చికిత్స ప్రారంభించింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాబుకు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది.గురువారం బాబు పూర్తిగా కోలుకోవడంతో వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. తమ బాబు తీవ్ర అనారోగ్యంతో ఉన్న సమయంలో శ్రీరాజరాజేశ్వర హాస్పిటల్ డాక్టర్ ప్రదీప్ రావు అందించిన వైద్యం, ఆసుపత్రి సిబ్బంది సహకారంతో ప్రాణాపాయం నుంచి బయటపడి పూర్తిగా కోలుకున్నాడని తల్లిదండ్రులు తెలిపారు. తమ బాబును కాపాడిన డాక్టర్ ప్రదీప్ రావు, ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రామాలయం వద్ద ధర్మశాల నిర్మాణానికి స్లాబ్



**తాడ్వాయి ఆగస్టు13(మహాప్రభ)**
తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలోని శ్రీ రామాలయం వద్ద నిర్మిస్తున్న ధర్మశాల నిర్మాణ పనుల్లో భాగంగా గురువారం స్లాబ్ పోయడం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రామ భక్తులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో ధర్మశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలో శ్రీ రామాలయానికి వచ్చే భక్తులు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలకు సౌకర్యంగా ఉండేలా ధర్మశాలను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్మాణంలో కీలకమైన స్లాబ్ పోసే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా రామ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తై ధర్మశాల త్వరగా అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ధర్మశాల నిర్మాణానికి గ్రామ ప్రజలు, రామ భక్తులు తమ వంతు సహకారం అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, యువకులు తదితరులు పాల్గొన్నారు. రామాలయం వద్ద ధర్మశాల నిర్మాణం పూర్తయితే భక్తులకు మరింత సౌకర్యం కలగనుందని గ్రామస్తులు తెలిపారు.

## అంబులెన్సులోనే ప్రసవం: తల్లి, బిడ్డ క్షేమం

**-108 సిబ్బంది చాకచక్యం సాధారణ ప్రసవం**

**-గుర్జుల్ గ్రామంలో 108 సేవలతో కాపాడిన ప్రాణాలు**



**గాంధారి ఆగస్టు 13 (మహా ప్రభ)** మండలం గుర్జుల్ గ్రామానికి చెందిన బాధవత్ రేఖకు, గురువారం ఉదయం ప్రసవ వేదనలు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సురేష్, ప్రకాష్ గౌడ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇది రెండవ కాన్పు కావడంతో నొప్పులు ఎక్కువగా ఉండటంతో, అంబులెన్సులోనే మార్గ మధ్యం లో సాధారణ ప్రసవం చేయించారు. ప్రసవ అనంతరం తల్లి, ఆడ శిశువుకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం గాంధారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొదటి కాన్పు బాబు, రెండవ కాన్పు ఆడ శిశువు. సకాలంలో సేవలు అందించిన 108 సిబ్బందికి బాదావత్ రేఖ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, కృతజ్ఞతలు తెలిపారు.

## గాంధారి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

**-నోడల్ అధికారి షేక్ సలాం చేతుల మీదుగా నోట్‌బుక్స్ పంపిణీ**

**-కష్టపడి చదివి దేశానికి ఉపయోగపడేలా ఎదగండి**



**గాంధారి: ఆగస్టు 13 (మహాప్రభ)**
ప్రభుత్వ జూనియర్ కళాశాల గాంధారిలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్‌బుక్స్‌ను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షేక్ సలాం మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని సూచించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, థామస్ ఎడిసన్ వంటి గొప్ప వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్, అధ్యాపకులు రాజగోపాల్, లక్ష్మణ్, శ్రీధర్, విజయకుమార్, రమేష్, సంబాజి, సరిత, సుజాత, స్వప్న, మమత, మల్లయ్య, నాన్ టీచింగ్ సిబ్బంది గణేష్, ఆరిఫ్, రాములు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా సహకార అధికారిగా మాలోతు సర్దార్ సింగ్.

**మహబూబాబాద్ ఆగస్టు 13 (మహాప్రభ)**
మహబూబాబాద్ జిల్లా సహకార అధికారిగా (డీసీఓ) మాలోతు సర్దార్ సింగ్ నియమితులయ్యారు. గతంలో జిల్లా సహకార అధికారిగా విధులు నిర్వహించిన విజయకుమారి కరీంనగర్ జిల్లా డీసీసీబీ స్పెషల్ ఆన్ డ్యూటీ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లి విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా సహకార శాఖకు కొత్త డీసీఓగా మాలోతు సర్దార్ సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లాలో సహకార సంఘాల పనితీరు, రైతులకు అందుతున్న సహకార సేవలు, సహకార బ్యాంకుల కార్యకలాపాలు తదితర అంశాలపై ఆయన దృష్టి సారించనున్నారు. కొత్త డీసీఓగా సర్దార్ సింగ్ బాధ్యతలు స్వీకరించడంతో జిల్లాలో సహకార రంగం మరింత బలోపేతం అవుతుందని సంబంధిత వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## మా ఊరు.. మా బడి..
# మనందరి బాధ్యత





**-దాతల దాతృత్వంతో.. ప్రభుత్వ బడికి కొత్త వెలుగులు**

**-రూ.6 లక్షలతో తరగతి గది నిర్మాణం.. విద్యార్థులకు విలువైన వసతుల కల్పన**

**-ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల సమిష్టి సహకారంతో అభివృద్ధి బాటలో పాఠశాల**

**-ప్రత్యేక కథనం యాసారపు భాస్కర్(MPED,MCJ)**

**పెద్దవంగర, ఆగస్టు 13 (మహాప్రభ):**
ప్రభుత్వ పాఠశాల అంటే కేవలం విద్యను అందించే కేంద్రం మాత్రమే కాదు.. గ్రామ భవిష్యత్తుకు పునాది వేసే విద్యాలయం. ఈ ఆలోచనతో చిన్నవంగర ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, దాతలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు చేయూతనందిస్తున్నారు. తమ ఊరి బడి తమ బాధ్యతగా భావించి పలువురు దాతలు ముందుకు రావడంతో పాఠశాలలో మౌలిక వసతులు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తోంది.

**అసంపూర్తి తరగతి గదికి సంపూర్ణ రూపం**
పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదిని ఓ దాత రూ.6 లక్షల వ్యయంతో పూర్తి చేయడం పాఠశాల అభివృద్ధికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులకు అదనపు తరగతి గది అందుబాటులోకి రావడంతో బోధనకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడింది.

**దాతల చేయూత.. బడికి బాసట**
పాఠశాల అవసరాలను గుర్తించిన పలువురు దాతలు తమ వంతు సహాయాన్ని అందించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఓ దాత -- రూ.6,00,000 వ్యయంతో అసంపూర్తిగా ఉన్న తరగతి గదిని పూర్తి చేశారు.

జలగం ఎల్లస్వామి -- రూ.85,000 విలువైన 12



ద్వంద్వ డెస్క్ బెంచీలను అందజేశారు.

ఇన్ఫోసిస్ సంస్థ -- సామాజిక బాధ్యతలో భాగంగా రూ.30,000 విలువైన కంప్యూటర్‌ను అందించింది.

కొంత మంది చిన్నవంగర ఎస్సీ కాలనీవాసులు -- పాఠశాల అభివృద్ధికి రూ.30,000 విరాళంగా అందించారు. పాకనాటి రామ్ రెడ్డి ( ఎన్నారై) 30000

జలగం చంద్రశేఖర్ -- రూ.20,000 విలువైన టెలివిజన్‌ను అందజేశారు.

యాసారపు ప్రవీణ్ (న్యాయవాది) -- రూ.12,000 విలువైన నీటి శుద్ధి యంత్రాన్ని అందజేశారు.

పాకనాటి కృష్ణారెడ్డి (విశ్రాంత ఇంజనీర్) -- రూ.8,000 విలువైన మైక్ సెట్‌ను అందజేశారు.

వల్లపు మధు -- రూ.8,000 విలువైన రెండు గ్రీన్ బోర్డులను అందజేశారు. సర్పంచ్ మూసుకుపూలమ్మ (మహేందర్) ఐదు వేల రూపాయలు, రైస్ మిల్ ఓనర్ నాగేశ్వరరావు 5000 రూపాయలు,జలగం కాంతారావు 5000, జలగం శ్రీహరి 5000

పాకనాటి ప్రతాపరెడ్డి (విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు) -- రూ.4,000 విలువైన బీరువాను అందజేశారు.

చిక్కాల సతీష్ (టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు) -- రూ.3,000 విలువైన చిత్రాలను

ఉపసర్పంచ్ యాసారపు రవి 2000 వార్డు నెంబర్ ఎర్రబెల్లి రవి 2000 అందజేశారు.

**ప్రజాప్రతినిధుల చొరవతో మరింత అభివృద్ధి**
పాఠశాల అభివృద్ధిలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. పాఠశాల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు దాతలు, గ్రామస్తులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నారు. గ్రామ ప్రజల సహకారంతో పాఠశాలకు అవసరమైన మరిన్ని వసతులు సమకూర్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

**విద్యతో పాటు విలువలకు పెద్దపీట**
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాఠ్యబోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విద్యా కార్యక్రమాల్లో విద్యార్థులను చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.

**ప్రభుత్వ బడిపై నమ్మకం.. గ్రామస్తుల సహకారం**
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో పాటు సమాజ భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్, ఉపాధ్యాయులు, దాతలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు సమన్వయంతో ముందుకు సాగితే పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఊరి బడి కోసం ఒక్కొక్కరూ ఒక్కో అడుగు ముందుకు వేస్తుండటంతో చిన్నవంగర ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తోంది. దాతల ఔదార్యం, ప్రజాప్రతినిధుల చొరవ, ఉపాధ్యాయుల అంకితభావం, గ్రామస్తుల సహకారం కలిసొస్తే ప్రభుత్వ బడులు సైతం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులుగా నిలుస్తాయనే సందేశాన్ని ఈ పాఠశాల చాటుతోంది.

# పీఏ పల్లి మండలం అభివృద్ధిలో ముందుండాలి

**-ఎమ్మెల్యే బాలు నాయక్.**

**దేవరకొండ డివిజన్ ఆగస్టు 13 (మహాప్రభ**
(పెద్దఅడిశర్లపల్లి) మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిననిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు మండల అభివృద్ధికి శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రాధాన్యత కావాలని అన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాగు సలహాలు విత్తనాలు ఎరువులు పంటల రక్షణకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో అందించాలని రైతుల ఆదాయం పెంచే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఒవెన్యూ శాఖ పరిధిలోని భూ సమస్యలు, ఫారెస్ట్ శాఖకు సంబంధించిన భూసమస్యలు ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు సంబంధించిన ఇతర రెవెన్యూ సేవలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు చిన్నచిన్న పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని అన్నారు.

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామాల్లో అంతర్గత రహదారులు డ్రైనేజీ పారిశుధ్యం వీధి దీపాలు ప్రభుత్వ భవనాలు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి



గ్రామంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అన్నారు. వి. బి . జి ఆర్ ఏ ఎం జి ద్వారా గ్రామీణ కూలీల కు పని కల్పించడంతో పాటు ద్వారా గ్రామపంచాయతీ భవనాలు అంగన్వాడి కేంద్రాలు వాటి వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలు ఏర్పాటు చేయాలి గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే నీటి సంరక్షణ చెరువులు కాలువలు మొక్కల పెంపకం వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన తాగునీరు మరుగుదొడ్లు విద్యుత్ ఇతర మౌలిక సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్యం మరింత చేరువ కావాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు గర్భిణీలు చిన్నారులు వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మిషన్ భగీరథ విద్యుత్ శాఖలు గ్రామాల్లో తాగునీరు విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పౌరసరఫరాలు, సంక్షేమ మహిళా శిశు సంక్షేమ శాఖలు అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ పెన్షన్లు కళ్యాణలక్ష్మి ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క లబ్ధిదారుడు కూడా ప్రభుత్వ పథకాల నుంచి దూరం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని అన్నారు. పశుసంవర్ధక ఉద్యానవన మత్స్య, మార్కెటింగ్ శాఖల అధికారులు రైతులు, గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయ మార్గాలను అందించే పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలని ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. పీఏ పల్లి మండలంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు తాగునీరు రహదారులు, విద్య వైద్యం పారిశుధ్యం కరెంటు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ మండలాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రమౌళి,ఎమ్మార్వో జయశ్రీ,మండల పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్ రెడ్డి,గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, పాల్గొన్నారు.

## బదిలీ పై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

**రామగిరి, ఆగస్ట్ 13 (మహాప్రభ)**
రామగుండం-3 ఏరియా లోని సి.హెచ్.పి నందు డి.జి.యం గా విధులు నిర్వహిస్తూ రామగుండం-1 ఏరియా ఇంజినీర్ గా బదిలీ పై వెళ్తున్న కాశీ విశ్వేశ్వర రావు ను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, రామగుండం-3 ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ యం.రామ్మోహన్, వివిధ విభాగాల అధిపతులు గురువారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు



తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఉదయ భాస్కర్, విభాగాధిపతులు రాజా రెడ్డి, బి.టి.మురళీ కృష్ణ, సి.జె.సురేఖ, బి.సుదర్శనం, అప్సర్ పషా, రవిచరణ్, ఆసిఫ్ యాసిన్, ప్రకాష్ , మేఘన, డివై పియం వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్.. నష్టాల్లోనే కొనసాగిన నిఫ్టీ

భారత స్టాక్ మార్కెట్ గురువారం మిశ్రమ ఫలితాలతో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ లాభాల్లో ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ మాత్రం నష్టాల్లోనే ముగిసింది. గత రెండు రోజులు స్టాక్ మార్కెట్ నష్టాల్లోనే ముగిసిన సంగతి తెలిసిందే. అయితే, గురువారం 30 షేర్ బీఎస్ఈ సెన్సెక్స్ 113.61 పాయింట్లు (0.15 శాతం) లాభపడి 78,079.96 వద్ద ముగిసింది. రోజులో గరిష్ఠంగా 78,119.39 పాయింట్ల గరిష్టాన్ని, 77,665.89 కనిష్టాన్ని తాకింది. అలా, 453.5 పాయింట్లు కోల్పోయినప్పటికీ, చివరకు లాభాల్లో ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ మాత్రం నష్టాల్లో ముగిసింది.నిఫ్టీ 40.10 పాయింట్లు (0.16 శాతం) నష్టపోయి, 24,395.85 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్ మాత్రం లాభాల్లోనే ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 99.88 పాయింట్లు (0.53 శాతం) లాభపడగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ కూడా 31.84 పాయింట్లు (0.35 శాతం) లాభపడింది. నిఫ్టీ రియాల్టీ షేర్లు 0.97 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ షేర్లు 0.84 శాతం లాభపడ్డాయి. అయితే, నిఫ్టీ మెటర్ షేర్లు మాత్రం 1.05 శాతం న



ష్టపోయాయి. సెన్సెక్స్ 30లో ఇండిగో, ఎల్ అండ్ టీ, హిందుస్తాన్ యునీలీవర్, బీఈఎల్, ఎన్టీపీసీ లాభపడ్డాయి. వీటిలో ఇండిగో షేర్లు 2.86 శాతం లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్, ఇన్ఫోసిస్, టైటాన్ నష్టపోయాయి. అత్యధికంగా ఐసీఐసీఐ షేర్లు 3.71 శాతం పడిపోయాయి. హోర్ముజ్ జలసంధి తెరిచే అంశంపై సందిగ్ధత, క్రూడాయిల్ ధరల పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు, బ్యాంక్, కన్స్యూమర్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి మూలంగా మిశ్రమ ఫలితాలు వచ్చాయి. డాలర్‌తో రూపాయి మారక విలువ 12 పైసలు తగ్గి 95.44 వద్ద కొనసాగుతోంది. బ్రెంట్ క్రూడాయిల్ ధర 87.79 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,381.47 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## టయోటా హైరైడర్ కొత్త ఏరో బ్లాక్ ఎడిషన్ విడుదల




టయోటా ఇండియా తమ పాపులర్ ఎస్‌యూవీ అర్బన్ క్రూయిజర్ హైరైడెర్‌లో సరికొత్త ఏరో బ్లాక్ ఎడిషన్‌ను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. ఈ కొత్త ఎడిషన్‌లో ఎస్‌యూవీకి ప్రత్యేకమైన బ్లాక్-థీమ్ డిజైన్‌ను అందించారు. పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉండే ఈ స్టైలింగ్ ప్యాకేజీ ధర రూ.31,999. ఎక్స్‌టీరియర్‌లో అప్పర్ గ్రిల్ గార్నిష్, హెడ్‌ల్యాంప్ సరౌండ్స్, టెయిల్‌గేట్ ట్రిమ్ వంటి భాగాలను బ్లాక్ కలర్‌లోకి మార్చారు. ఇంజిన్, సస్పెన్షన్ లేదా గేర్‌బాక్స్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు.

## భారీగా తగ్గిన బంగారం ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధర భారీగా తగ్గింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1260 తగ్గి రూ.1,53,600కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ1,150 తగ్గి రూ.1,40,800 పలుకుతోంది. వెండి ధర మాత్రం స్థిరంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో నగరాన్ని బట్టి వీటి ధరల్లో స్వల్ప తేడాలు ఉండొచ్చు.

## రూ.299 సహా 4 ప్రీపెయిడ్ ప్లాన్‌లను తొలగించిన ఎయిర్‌టెల్

**న్యూఢిల్లీ:**
టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ రీచార్జ్ ప్లాన్‌లలో కీలక మార్పులు చేసింది. రూ.299, రూ.579, రూ.619, రూ.649 ధరలతో అందుబాటులో ఉన్న నాలుగు మిడ్-రేంజ్ ప్లాన్‌లను కంపెనీ తన క్యాటలాగ్ నుంచి తొలగించినట్లు సమాచారం. ముఖ్యంగా రూ.299 ప్లాన్‌ను ఎయిర్‌టెల్ నిలిపివేయడంతో, దాని స్థానంలో వినియోగదారులు రూ.349 ప్లాన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్లాన్‌ను ఉపయోగించే కస్టమర్లపై రీచార్జ్ ఖర్చు సుమారు 16 శాతం పెరగనుంది. ప్లాన్‌ల తొలగింపు, ధరల మార్పుల వెనుక ఎయిర్‌టెల్ సగటు వినియోగదారుడి ఆదాయం పెంచే వ్యూహం ఉన్నట్లు టెలికాం రంగానికి సంబంధించిన నివేదికలు




సూచిస్తున్నాయి. అధిక విలువ కలిగిన ప్లాన్‌ల వైపు వినియోగదారులను మళ్లించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడమే కంపెనీ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, ప్లాన్‌ల ధరలు పెరగడం వల్ల బడ్జెట్ రీచార్జ్‌లపై ఆధారపడే వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. ఎయిర్‌టెల్ తాజా మార్పులతో ఇతర టెలికాం సంస్థలు కూడా తమ ప్రీపెయిడ్ ప్లాన్‌లను సమీక్షించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# స్పోర్ట్స్

## ఐపీఎల్ నిజంగా అద్భుతం.. నిషేధం ముగిశాక మళ్లీ ఆడుతా..!

దేశం కోసం కోట్లు కురిపించే ఐపీఎల్ కు దూరమైన హ్యారీ బ్రూక్ మనసు మార్చుకునేలా ఉన్నాడు. వేలంలో భారీ ధర పలికినా.. తీరా సీజన్ ఆరంభానికి ముందే వైదొలిగే అలవాటున్న బ్రూక్.. ఈసారి ఆ పొరపాటు చేయకూడదని భావిస్తున్నాడు. ఐపీఎల్‌లో తనపై రెండేళ్ల నిషేధం పూర్తయ్యాక.. మళ్లీ పునరాగమనం చేయడంపై ఆలోచిస్తానని చెప్పాడీ ఇంగ్లండ్ కెప్టెన్.ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా రాణిస్తున్న హ్యారీ బ్రూక్ ఐపీఎల్‌లో పునరాగమనం చేయడంపై ఆలోచిస్తున్నాడు. దేశం తరఫున మూడు ఫార్మాట్లలో అదరగొడుతున్న అతడు.. తాజాగా ఐపీఎల్‌పై స్పందించాడు. 'ఐపీఎల్ నిజంగా గొప్ప టోర్నమెంట్. అందులో ఆడడం నిజయంగా మర్చిపోలేని అనుభవం. ఐపీఎల్ ఆడితే మనలోని ఉత్తమ బ్యాటర్ బయటకొస్తాడు. ఐపీఎల్ నిజంగా మంచి పోటీనిచ్చే టోర్నీ. ఈ మెగా ఈవెంట్‌లో మళ్లీ ఆడడంపై ఆలోచిస్తా' అని బ్రూక్ వెల్లడించాడు.ఏడాది క్రితం ఇదే బ్రూక్ నాకు ఐపీఎల్ కాదు, దేశమే ముఖ్యం అని ప్రకటించాడు. 'నేను ఇంగ్లండ్ తరఫున ఆడాలని మాత్రమే అనుకుంటున్నా. మా దేశానికి ప్రాతినిధ్యం వహించడమే గొప్ప గౌరవం. ఇంతకుముందు జట్టు విజయం కోసం ఎంతగా తపించేవాడినో.. ఇప్పుడు సారథిగా అంతే తపన కనబరుస్తాను. నా నాయకత్వంలో ఇంగ్లండ్ వైట్ బాల్ క్రికెట్‌లో మరిన్ని విజయాలు సాధించాలని




కోరుకుంటున్నా. ఈమధ్య కాలంలో అందరూ ఫ్రాంచైజ్ క్రికెట్ మీద ఆసక్తి చూపిస్తున్నారు. నా దృష్టిలో దేశం కంటే ఏ లీగ్ గొప్పది కాదు. ఐపీఎల్ అయినా సరే నా తొలి ప్రాధాన్యం మాత్రం ఇంగ్లండ్‌కే. అందుకే.. మా దేశం జెర్సీతో మైదానంలోకి దిగిన రోజున నా మనసెంతో ఉప్పొంగిపోతుంది. ఐపీఎల్‌కు దూరం కావడం వల్ల కోట్లలో డబ్బు కోల్పోతున్నా. ఒకవేళ ఇలాంటి ఫ్రాంచైజ్ క్రికెట్‌లో భాగమైనా సరే.. దేశం తరఫున ఆడాల్సి వస్తే మాత్రం ఆ అవకాశాన్ని వదులుకోను' అని బ్రూక్ వెల్లడించాడు. ఇంగ్లండ్ సారథిగా బ్రూక్‌కు మే నెలలో తొలి సవాల్ ఎదురుకానుంది. మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు వెస్టిండీస్ జట్టు రానుంది.గత మూడేళ్లుగా టీ20, టెస్టుల్లో సంచలన ఇన్నింగ్స్‌లు ఆడుతున్న బ్రూక్ ఐపీఎల్‌లో భారీ ధర పలికాడు. 18వ సీజన్ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.6.25 కోట్లకు కొన్నది. కానీ, బిజీ షెడ్యూల్ కారణంగా వైదొలుగుతున్నాని డీసీకి మెసేజ్ పంపాడు బ్రూక్. దాంతో, నిబంధనలను ఉల్లఘించినందుకు ఈ ఇంగ్లండ్ స్టార్‌పై రెండేళ్ల నిషేధం విధించింది ఐపీఎల్ పాలకమండలి. 2016వ సీజన్‌లో రూ.13.5 కోట్లకు సన్‌రైజర్స్ యాజమాన్యం బ్రూక్‌ను కొనుగోలు చేసింది. అయితే. కోల్‌కతాపై సెంచరీతో సరిపుచ్చాడీ బ్యాటర్.

## భారత జట్టులో స్టార్లున్నా.. మాకు ప్రమాదకారి అతడే..!

ఒకప్పుడు సీనియర్ బ్యాటర్లతో టెస్టుల్లో పటిష్ఠంగా కనిపించిన భారత జట్టుకు శ్రీలంక సిరీస్ పరీక్ష కానుంది. బ్యాటింగ్ యూనిట్ బలంగానే ఉన్నా లంకలో రాణించేది ఎవరు? అనేది సిరీస్ మొదలైతేగానీ చెప్పలేం. ఆగస్టు 15న గాలే స్టేడియంలో తొలి మ్యాచ్‌కు సిద్ధమవుతున్న టీమిండియాలో ఒకరి నుంచే తమకు ప్రమాదం పొంచి ఉందని లంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా అన్నాడు. అలాఅనీ అతడు సారథి శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వీ జైస్వాల్ పేర్లు చెప్పలేదు.వామప్ మ్యాచ్‌లో గెలుపొందిన భారత్.. రెండు టెస్టుల సిరీస్‌లో విజయంపై కన్నేసింది. ఆగస్టున 15న తొలి మ్యాచ్ కోసం నెట్స్‌లో చెమటోడ్చుతున్నారు టీమిండియా ఆటగాళ్లు. వామప్ మ్యాచ్‌తో టచ్‌లోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వీ జైస్వాల్ లంక బౌలర్లను దంచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే..తమకు వీరి నుంచి కాకుండా కేఎల్ రాహుల్ నుంచి ప్రమాదం ఉందని లంక సారథి ధనంజయ డిసిల్వా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.అనుభవం పరంగా చూస్తే కేఎల్ రాహుల్



నుంచి మాకు అతిపెద్ద ప్రమాదం ఉంది. ప్రపంచవ్యాప్తంగా అతడు బాగా రాణించాడు. శ్రీలంకలో కొన్ని మ్యాచ్‌లు కూడా ఆడాడు రాహుల్. గత పర్యటన((2017)లో మా పరిస్థితులకు తగ్గట్టు ఆడాడు. ఈసారి మాకు అతడే సవాల్ విసరనున్నాడు. భారత్ అనుకుంటున్నట్టు మేము స్పిన్నర్లపై ఎక్కువగా ఆధారపడం. మా ప్రధాన అస్త్రం స్పిన్ అయినప్పటికీ.. మాకు నాణ్యమైన పేసర్లు ఉన్నారు. టీమిండియాను ఒత్తిడిలో పడేసి.. మ్యాచ్‌ను నాలుగు, ఐదో రోజు వరకూ తీసుకెళ్తాం.' అని ధనంజయ తెలిపాడు. 2017లో లంక సిరీస్‌లో రెండు, మూడో టెస్టు ఆడిన కేఎల్ రాహుల్.. రెండు మ్యాచుల్లో అర్ధ శతకాలు సాధించాడు. ప్రపంచటెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో వరసగా 4, 5 స్థానాల్లో ఉన్న.. ఇండియా, లంకకు రెండు టెస్టుల సిరీస్ చాలా కీలకం. దాంతో.. విజయం కోసం ఇరుజట్లు సర్వశక్తులు ఒడ్డనున్నాయి.


## ఫిఫా వరల్డ్‌కప్ స్ఫూర్తితో అద్భుతాలు చేస్తాం.. డిఫెండర్ ఇషిక..!



మహిళల హాకీ వరల్డ్‌కప్ సమీపిస్తోంది. మరో ఐదు రోజుల్లో మెగా ఈవెంట్ మొదలవ్వనుంది. ఈసారి టైటిల్ లక్ష్యంగా చెలరేగాలనుకుంటున్న భారత జట్టుకు ఫిఫా వరల్డ్‌కప్ స్ఫూర్తి అంటోంది డిఫెండర్ ఇషికా చౌదరీ . ఇటీవలే అమెరికాలో ముగిసిన సాకర్ వేడుక.. ఏ జట్టును కూడా తక్కువ అంచనా వేయకూడదని స్పష్టం చేసిందని పేర్కొన్న ఇషిక టీమిండియా కూడా అద్భుతాలు చేస్తుందని చెప్పింది.ఫేవరెట్ల జట్లకు చిన్న టీమ్‌లు షాకివ్వడం ప్రతి ఆటలో చూస్తుంటాం. ఇటీవలే ముగిసిన ఫిఫా వరల్డ్‌కప్‌లోనూ అనామక జట్టైన కేప్ వెర్డే చేతిలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తృటిలో ఓటమి తప్పించుకుంది. ఆద్యంతం సంచలనాలతో రసవత్తరంగా సాగిన ఫిఫా వరల్డ్‌కప్పే ఇప్పుడు హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టుకు ప్రేరణ కానుంది. 'ఫిఫా వరల్డ్‌కప్‌తో ఏ జట్టు అవకాశాలను కొట్టిపారేయలేం అని మరోసారి నిరూపితమైంది. నాలుగేళ్లకోసారి జరిగే హాకీ ప్రపంచకప్‌లోనూ ఏదైనా సాధ్యమే. ఫిఫా స్ఫూర్తితో మేము చెలరేగుతాం' అని డిఫెండర్ ఇషికా చౌదరీ వెల్లడించింది. అన్నట్టు.. తనకు ఇదే మొట్టమొదటి హాకీ వరల్డ్‌కప్.మహిళల హాకీ వరల్డ్‌కప్ పోటీలకు బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. ఆగస్టు15న మొదలవ్వనుంది. 16 రోజుల పాటు సాగే ఈ టోర్నీలో విజేత ఎవరో ఆగస్టు 30న తెలియనుంది. గ్రూప్ డీలోని భారత జట్టు లీగ్ దశలో చైనా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలను ఢీకొట్టనుంది. ఆగస్టు 16న చైనాతో, ఆగస్టు 18న దక్షిణాఫ్రికాతో, ఆగస్టు 20న ఇంగ్లండ్‌తో టీమిండియా తలపడనుంది.

# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు


## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం




అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

# మహాదేవిగా కామాక్షి భాస్కర్ల సరికొత్త సాహసం..


## ఎం.ఎస్. రాజు 'అగధ'పై భారీ అంచనాలు!




టాలీవుడ్ తెరపై ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమాల హవా జోరుగా సాగుతోంది. ఒకప్పుడు గ్లామర్ పాత్రలకే పరిమితమైన కథానాయికలు, ఇప్పుడు బలమైన కథలను తమ భుజాలపై మోస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నారు. అరుంధతి చిత్రంతో అనుష్క శెట్టి వేసిన బలమైన ముద్ర నుంచి, ఇటీవలి కాలంలో సమంత 'మా ఇంటి బంగారం', రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్', నివేదా థామస్ '35' వంటి వైవిధ్యమైన చిత్రాల వరకు మహిళా ప్రధాన కథలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. అయితే ఈ ట్రెండ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఇప్పుడు మరో ప్రతిభావంతురాలైన నటి సిద్ధమయ్యారు. 'పొలిమేర' చిత్రాలతో నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న టెర్రిఫిక్ ఆర్టిస్ట్ కామాక్షి భాస్కర్ల , ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కిన తాజా సంచలన చిత్రం 'అగధ' తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆగస్టు 14న ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా విడుదల కాబోతోంది.ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల 'మహాదేవి' అనే అత్యంత శక్తివంతమైన, విభిన్నమైన ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'అగధ' టీజర్, ట్రైలర్‌లు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. ఇప్పటివరకు కామాక్షి చేసిన సినిమాలకు, పాత్రలకు పూర్తి భిన్నంగా ఈ చిత్రం ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది. కేవలం నటనకు మాత్రమే కాకుండా, కథలో ప్రాధాన్యమున్న యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆమె స్వయంగా నటించడం ఈ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఒక మహిళా ప్రధాన కథాంశంతో వస్తున్న ఈ సినిమా కామాక్షి కెరీర్‌లో మైలురాయిగా నిలవడమే కాకుండా, టాలీవుడ్‌లో ఉమెన్ సెంట్రిక్ సినిమాల విజయ పరంపరను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. విభిన్నమైన భావోద్వేగాలను పండిస్తూ, ఒక కొత్త సినిమాటిక్ అనుభూతిని పంచడానికి సిద్ధమైన 'అగధ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మహాదేవిగా కామాక్షి భాస్కర్ల అద్భుత నటనను చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# తారక్ లేకున్నా ఆగని డ్రాగన్' షూటింగ్..


## -వచ్చే నెల నుంచి నయా షెడ్యూల్ షురూ!



టాలీవుడ్ అగ్ర కథనాయకుడు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'డ్రాగన్' షూటింగ్‌కు సంబంధించి ఒక లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. ఇటీవలే ఎన్టీఆర్ సర్జరీ విజయవంతంగా పూర్తి కావడంతో, ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ 3 నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.భూజానికి జరిగిన సర్జరీ అనంతరం ఎన్టీఆర్ ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నప్పటికీ, సినిమా షూటింగ్‌లో ఎలాంటి బ్రేక్ ఉండకూడదని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 3 నుంచి మొదలయ్యే షెడ్యూల్‌లో టాకీ పార్ట్ తో పాటు చిన్ననాటి సన్నివేశాలను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కించబోతున్నారు. తారక్‌కు సంబంధం లేని ఈ బ్యాలెన్స్ పోర్షన్‌ల షూటింగ్ పూర్తయిన తర్వాత, సెప్టెంబర్ మూడో వారం తర్వాత ఎన్టీఆర్ స్వయంగా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కాబోతున్నట్లు సమాచారం. మరోవైపు, ఎన్టీఆర్ గాయం కారణంగా ఈ సినిమా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తమని తెలుస్తుంది. దీనిపై కూడా మేకర్స్ క్లారిటీ ఇవ్వవలసి ఉంది.


# రెడ్ డ్రెస్ లో మెరిసిపోతున్న రకుల్

రకుల్ ప్రీత్ సింగ్ గురించి, ఆమె అందం గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు, భారీ ఫాలోయింగ్ ను సొంతం చేసుకున్న రకుల్, ప్రస్తుతం బాలీవుడ్ కు వెళ్లి అక్కడే సెటిలైపోయింది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోలను నెట్టింట షేర్ చేస్తూ, ఫాలోవర్లకు టచ్ లో ఉండే రకుల్ తాజాగా ట్రెండీ లుక్ లో దర్శనమిచ్చింది. ఈ ఫోటోల్లో రకుల్ రెడ్ కలర్ షోల్డర్ లెస్ కాలమ్ ఫ్రాక్ ధరించి ఎంతో అందంగా కనిపించింది. ఈ డ్రెస్ లో రకుల్ ను, ఆమె అందాలను చూసి కుర్రాళ్లు ఫిదా అయిపోయి, వాటిని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.



# మొదటి సినిమాతోనే రూ.58 కోట్లు..

## బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్న లోకేష్ కనగరాజ్ 'డీసీ'!



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com